REGD: NO H 18 విడిప్రతి 0-20పై. 3-12-65 శుక్రవారం

# జమీన్‌రైతు

సంస్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు

సంపుటి 37 ] సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి [ సంచిక 48

## భూసంస్కరణల భండారం!

మన భూసంస్కరణల భండారం మొన్న శాసనసభలో బయటపడి పోయింది. భూసంస్కరణలని బ్రహ్మాండమైన భ్రమకల్పించి, స్వర్గాన్ని భూతలానికి తెచ్చివడేసినట్లు అభిప్రాయంకల్గించి, రైతాంగంలో భయభ్రాంతులను రేకెత్తించిన గరిష్ఠ పరిమితుల చట్టంవల్ల రాష్ట్రంలో మిగిలిన భూమి 56,000 ఎకరాలేనట! అదికూడా యింకా ప్రభుత్వస్వాధీనం కాలేదట! అంతమాత్రానికి ఆ చట్టాన్ని పున సంహరించుకోగూడదా అని ఒక స్వతంత్రపార్టీ సభ్యుడు ప్రశ్నిస్తే, అది మీ ఆశయం, మా విధానంకాదు అన్నారు రెవిన్యూమంత్రి. వెంటనే స్పీకరు శ్రీ సుబ్బారెడ్డి ప్రశ్నించిన రాజగోపాలనాయుడు వంక తిరిగి అన్నారుగదా: "మీఆశయాన్ని వాళ్లు (కాంగ్రెస్ మంత్రులు) యింకో మార్గంలో అమలు జరుపుతున్నారు లెండి!"

## హైదరాబాదులేఖ

### * 1959సంవత్సరపు అదనపువ్యయానికి 1965లో ఆమోదం!

### * ఆంధ్రలోని మూడు విశ్వవిద్యాలయాల డిగ్రీలు చెల్లకుండాపోయే ప్రమాదం

### * చట్టమయ్యేలోగా సవరణకుప్రయత్నం

( మా హైదరాబాదు విలేఖరి )

అమ్మకంపన్ను రేటును హెచ్చించడం ద్వారా రాష్ట్రఆదాయాన్ని ఐదుకోట్లకు పైబడి హెచ్చించే అదనపుపన్నుభారపు చట్టాన్ని ఆమోదించవలసివస్తుందని, శీతాకాల సమావేశాలకు వచ్చేటప్పుడు శాసన సభ్యులకు తెలిసివుండదు.

ప్రభుత్వంకూడా ఈ విషయాన్ని చాలా కాలం కప్పిపుచ్చింది. నిజానికి అమ్మకం పన్నురేట్లను హెచ్చిస్తూ సవరించాలని, రాష్ట్రముల ఆదాయాలను పెంచడానికి, ప్రణాళికా వ్యయభారాన్ని మోయడానికి యిదొక్క టేమార్గమని రాష్ట్రప్రభుత్వాలకు నచ్చజెప్పి వొప్పించినది అశోకమెహతా నాయకత్వాన నడుస్తున్న ప్రణాళికా సంఘం. కాగా ఈ అదనపుపన్నుభారాన్ని అటు కేంద్రప్రభుత్వమూ, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ప్రజలమీదవేస్తున్నారు. అక్టోబరుమాసంలో దక్షిణాది రాష్ట్రాల ఆర్థికశాఖలకార్యదర్శులు శ్రీ మెహతా అధ్యక్షతన మద్రాసులో సమావేశమై, ఈ రాష్ట్రాలన్నింటిలో అమ్మకంపన్ను రేటు వొకేవిధంగావుండాలని సిఫార్సు చేశారు. దాన్ని పురస్కరించుకొని మనరాష్ట్రంలో అమ్మకంపన్నురేటును రెండుశాతంనుంచి మూడు శాతానికి హెచ్చిస్తూ ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టి శాసనసభచేత ఆమోదింపజేసింది.

అసలు ఈ సంవత్సరం అదనంగా పన్నువేయమని యింతవరకూ చెబుతూ వస్తున్న మన ప్రభుత్వపెద్దలు, ఢిల్లీ వెళ్లి అక్కడ ప్రణాళికాసంఘంతో చర్చలుజరిపి తిరిగిరాగానే, రూ. 79 కోట్ల వ్యయంకల ప్రణాళికాకార్యక్రమాలు కావాలంటే రూ. 7 కోట్లమేరకు అదనంగా పన్నులద్వారా రాబడి సంపాదించాలని ప్రకటించారు. శీతాకాల సమావేశంలోనే యిందుకు బిల్లు ప్రవేశపెడ్తారని తెలిసినప్పటికీ అమ్మకం పన్నుద్వారా ఈ అదనపు ఆదాయాన్ని రాబడతారని యెవరూ ఆశించలేదు. కాంగ్రెసుపార్టీ సభ్యులకుకూడా ఈ విషయం తెలియదు. చిత్తుబిల్లును ప్రకటించినరోజు ననే వారికికూడా ఈవిషయాన్ని తెలియ జేశారు.

ప్రణాళికకు కావల్సింది మొత్తం ఏడు కోట్ల రూపాయలయితే ఈ సవరణబిల్లు ద్వారా రు. 5 కోట్లు మాత్రమే వస్తాయి కదా మిగతావాటి విషయమేమిటని శాసన సభ్యులు అడిగినప్పుడు మంత్రులు మూకీభావం వహించారు. కాని శ్రీ వచ్చేటి

—కొరవ 6 వ పేజీలో

# నెల్లూరుకు రెండవ మార్గం

## ఆంధ్ర రాజధానిలో జిల్లారాజకీయాలు

(మా రాజకీయ పరిశీలకుడు)

నెల్లూరుమండల రాజకీయాలు పెద్దమలుపు తిరిగాయి. ఇంతవరకు 'ఒకవేట్రాఫిక్'గా వుండినది ఇప్పుడు రెండుమార్గాలేర్పడినవి. హైదరాబాదునుండి వచ్చిన ఒకరన్నారు "రాజధానిలో మన జిల్లా రాజకీయాలు భలే తమాషాగా వున్నాయి. పోటాపోటీలమీద వున్నాయి. పోయినవారికి పనిజేసిపెట్టుటకు నువ్వా నేనా అంటున్నారు" అన్నాడతను. ఇతర విషయాలెట్లయినా, కార్యార్థులైనవారి పనిమాత్రం హాయిగావుంది. బెట్టులేదు, బడాయి లేదు. వీరుకాకుంటేవారు, వారుకాకుంటేవీరు అనేరకంగా వుంది. అయినా ఎంతలో ఎంతమార్పు!

జిల్లాలో పూర్వం ఒకేఅధికారవర్గం వుండేది. ఇప్పుడు రెండోఅధికారవర్గం ఏర్పడింది. ఇదివరలో అధికారవర్గానికి వ్యతిరేకతవుండేది; కాని అది బయటపడేది కాదు. ఇప్పుడట్లా కాదు, అంతా బహిరంగమైపోయింది. శాసనసభ్యుల్లో సగానికి సగం పి. సి. వర్గానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నట్లున్నది. శాసనమండలి సభ్యుల్లో కూడా ఒకరిద్దరు వీరితో చేరినట్లుంది. జిల్లా విషయం ఏదివచ్చినా వీరంతా ఒకటిగా మాట్లాడుకొని చేస్తున్నట్లున్నది. పక్షం రోజులక్రితం ఒక శాసనసభ్యుడు ఈ పరిశీలకునితో అనుకూడా అన్నాడు-శాసనసభ సమావేశ సమయంలో తామంతా కలుసుకొని, సంప్రదించుకొని మున్ముందు గట్టిగా నిలబడదలచుకున్నామని. ఆ వ్యక్తి ఎప్పుడూ అంతగట్టిగా చెప్పేవాడుకాదు. పాత అధికారవర్గానికి వ్యతిరేకి అయినా, ఆ వ్యతిరేకతను ఎప్పుడూ కనపడనిచ్చే వాడుకాదు. అటువంటి మృదుస్వభావుడు అంత దృఢంగా చెప్పినప్పుడే, జిల్లా రాజకీయాలలో ఏదో పెద్దమార్పు వుందని పించింది.

ఈ మార్పుకు కారణం శ్రీ చెంచురామానాయుడుగారి మంత్రిత్వమా? అసలు నాయుడుగారి మంత్రిత్వమే ఈ మార్పుకు

—కొరవ 6 వ పేజీలో

### వలలో చిక్కుపడ్డ విశ్వనాథరెడ్డి

కర్నూలు మునిసిపల్ కమిషనర్ శ్రీ డి. విశ్వనాథరెడ్డి అవినీతి నిరోధకశాఖ వలలో చిక్కుపడ్డాడట. రు. 500 లు లంచం తీసుకుంటుండగా పట్టుబడినాడట.

శ్రీ విశ్వనాథరెడ్డి నెల్లూరు కమిషనర్‌గాకూడా వుండినవారు. విశ్వనాథరెడ్డి వంటి సీనియర్ ఆఫీసరు యింత చిన్న మొత్తానికి పాల్పడినాడంటే ఆశ్చర్యంగావుంది.

## అవినీతిపురాణం--అశ్రద్ధ అధ్యాయం

ఆంధ్ర శాసనసభలో అవినీతి పురాణానికి సంబంధించిన ప్రభుత్వ అశ్రద్ధ అధ్యాయమొకటి రంగంలోకి వచ్చింది. ప్రతిపక్షీయులేకాదు, కడకు స్పీకరు శ్రీ బి. వి. సుబ్బారెడ్డిగారుకూడా ఛీకొట్టారు.

విషయమిది: భువనగిరి బి. డి. ఓ. సమితిడబ్బు రు. 70,000 లు భోంచేశాడని సస్పెండు చేయబడినారు. ఇది జరిగి ఐదేళ్లయింది. దానిపై విచారణ జరుగుతూనేవున్నది. కాని మొన్న వున్నట్లుండి ప్రభుత్వం అతనిని వుద్యోగంలో చేర్చుకుంది. ఇదేమిటి అన్యాయం అని ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నించారు. ఏదో పాపం ఐదేళ్లుగా వుద్యోగం లేకుండా వుండినాడు, దయదలిచి వుద్యోగంలో చేరమన్నాం అన్నాడు - పంచాయితీరాజ్యం మంత్రి. ముఖ్యమంత్రికూడా ఏదో నవ్వుతూతేలిగ్గా జవాబుచెప్పాడు. ఏం జరుగుతున్నా కాంగ్రెస్ సభ్యులు నోరుమెదపరుకాని, స్పీకర్ వూరుకునేవారుకాదు. గట్టిగా మందలించి వదిలారు.

అప్పుడే ఇంకో విషయంకూడా వెల్లడి అయింది. మెదక్ జిల్లాలోని నారాయణ

— కొరవ 6 వ పేజీలో

కావలిలో పూర్ణావారి కేకులు, బిస్కెట్లు

పూర్ణా బిస్కెట్ ఫ్యాక్టరివారి కేకులు, స్పెషల్ బ్రెడ్లు, బన్నులు, బిస్కెట్లు వగైరాలు 4-12-65 తేది నుండి కావలిపట్టణంలోని లక్ష్మీ స్టోర్సులో లభించునని సంతోషపూర్వకముగ తెలియజేయుచున్నాము.

పూర్ణా బిస్కెట్ ఫ్యాక్టరీ - నెల్లూరు.

టెలిఫోన్లు: షో రూము 294, ఫ్యాక్టరీ 496, రెసిడెన్సు 492.

